# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పర్యావరణ ముప్పు నుండి భూగోళాన్ని కాపాడేందుకు సమిష్టి కృషి అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ పేర్కొన్నారు.
- ❖ దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.
- ❖ ఎన్‌పీఎస్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కోరారు.
- ❖ జమ్మూ కాశ్మీర్‌లో ఈరోజు జరిగిన తొలి దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కడపటి వార్తలు అందే సరికి 58.19 శాతం ఓటింగ్ నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి.
- ❖ మొదటి మానవ రహిత మిషన్‌కు ఇస్రో సిద్ధమవుతోందని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్ ప్రకటించారు.

================================

పర్యావరణ ముప్పు నుండి భూగోళాన్ని కాపాడేందుకు యువత ప్రభుత్వంతో కలసి పని చేయాలని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ కోరారు. గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ మహాత్మా మందిర్‌లో ఈ రోజు జరిగిన "ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు"లో ఆయన ప్రసంగిస్తూ... యువతకు పునరుత్పాదక ఇంధన రంగం అందిస్తున్న భారీ అవకాశాలను ప్రస్తావించారు. యువత భూగోళాన్ని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. భవిష్యత్ తరాల కోసం భూ గ్రహాన్ని రక్షించడానికి సమిష్టి చర్యలు అవసరమని ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు.

================================

దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణ కోసం ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదించింది. న్యూఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఆ వివరాలను సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల కోసం పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ ఇచ్చిన సిఫారసులను రెండు దశలలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. మొదటి దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయని అన్నారు. సార్వత్రిక ఎన్నికలు జరిగిన వంద రోజులలో రోజుల్లో పంచాయతీలు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో ఈరోజు జరిగిన తొలి దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కడపటి వర్తలు అందేసరికి 58.19 శాతం ఓటింగ్ నమోదైందని అధికార వర్గాలు తెలిపాయి. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జమ్మూ కాశ్మీర్ లో 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమైనది. ఆర్టికల్-370 రద్దు తర్వాత కాశ్మీర్‌లో తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి దశ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 7 జిల్లాల్లోని 24 స్థానాల్లో పోలింగ్ నిర్వహించారు. 90 మంది స్వతంత్ర అభ్యర్థులు సహా 219 మంది ఈ స్థానాలకు పోటీ పడుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ పింఛన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 75 ప్రాంతాల్లో ఏకకాలంలో వాత్సల్య పథకాన్ని మంత్రి ఈ రోజు న్యూఢిల్లీ నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశ భవిష్యత్ తరాన్ని ఆర్థికంగా సురక్షితంగా, ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపకల్పన చేసిందన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు వారి పేరుతో ఉమ్మడి ఖాతాలు తెరిచేందుకు వాత్సల్య పథకం అవకాశం ఇస్తోందని నిర్మలా సీతారామన్ వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష కేంద్రం (ఇస్రో) మొదటి మానవ రహిత మిషన్‌కు సిద్ధమవుతోందని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్, డాక్టర్ ఎస్. ఉన్నికృష్ణన్ నాయర్ ప్రకటించారు. ఈరోజు జరుగుతున్న 8వ బెంగుళూరు స్పేస్ ఎక్స్ పో సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... మానవరహిత మిషన్‌కు సంబంధించిన ఆర్బిటల్ మాడ్యూల్ సిద్ధమవుతోందని, త్వరలోనే శ్రీహరికోటకు దానిని తరలిస్తామని అన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఇస్రో 3 మానవరహిత విమానాలను అంతరిక్షంలోకి పంపిస్తుందని తెలిపారు. 2035 నాటికి చంద్రుడిపై దిగి, నమూనాలను సేకరించి తిరిగి భూమిపైకి వచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉండే చంద్రయాన్-4పై కూడా ఇస్రో పని చేస్తుందని డాక్టర్ ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నాలుగు రోజుల పాటు సాగే అతి పెద్ద వేడుక వరల్డ్ ఫుడ్ ఇండియా-2024 రేపు న్యూఢిల్లీలో ప్రారంభమవుతుంది. 90 దేశాలు, 26 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు, 18 కేంద్ర మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయని కేంద్ర ఫుడ్

ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమానికి జపాన్ భాగస్వామి దేశంగా ఉంటుందని, వియత్నాం ఇరాన్ దేశాలు కూడా పాల్గొంటాయని వెల్లడించింది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడం వంటి వాటి మీద ఈ కార్యక్రమంలో చర్చిస్తారు. అదే విధంగా ఆహార రంగంలో ప్రపంచంలోనే భారతదేశం అభివృద్ధి చెందుతున్న పాత్రను కూడా ఈ కార్యక్రమంలో కీలకంగా ప్రస్తావిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మంకీ పాక్స్ (Mpox) రెండవ కేసు నమోదైంది. కేరళ ఒక వ్యక్తికి ఈ వైరస్ సోకినట్లు ఈ రోజు నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ రోగిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఎం.పాక్స్‌కు సంబంధించిన నియమ నిబంధనలను పాటిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఆ వ్యక్తి మొదట ఇంట్లోనే ఐసొలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వ మంజేరి మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేరారని ఆమె వెల్లడించారు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఎంపాక్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. కాగా ఈ లక్షణాలు గమనించిన వారు ఆరోగ్య శాఖకు తెలియజేయడంతో పాటు వెంటనే చికిత్స పొందాలని ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలను కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇస్రో పంపిన ప్రతిపాదనలను అనుమతించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈ రోజు ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో చంద్రయాన్-4 మిషన్, గగన్‌యాన్, వీనస్ ఆర్బిటర్ మిషన్, ఎన్‌జీఎల్‌వి వాహకనౌక ప్రాజెక్టులకు అంగీకారం తెలిపింది. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టులకు నిధులు సైతం కేటాయించింది. ఈ వివరాలను మంత్రి వర్గ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌పాత్రికేయులకు వెల్లడించారు. కేబినెట్ చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం తెలిపిందని వివరించారు. ఈ ప్రాజెక్టులు చంద్రుడి నుంచి రాళ్లు, మట్టిని భూమిపైకి తీసుకురానున్నట్లు తెలిపారు. కాగా, ఈ ప్రాజెక్టు ఇస్రో 2026 నాటికి చేపట్టాలని భావిస్తున్నది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2047 నాటికి ప్రపంచంలోనే ఎక్కువ యువ జనాభాను కలిగి ఉంటుందని నీతి అయోగ్ CEO బీవీఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, 2047నాటికి తలసరి ఆదాయం సుమారు 20 వేల US డాలర్లు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని గుర్తు చేశారు. 2030 నాటికి భారతదేశం తన ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని సులభంగా రెట్టింపు చేసుకోగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ “ఏక్ పేడ్ మా కే నామ్” నినాదం కింద ఇప్పటి వరకు దాదాపు 7 వేల మొక్కలు నాటింది. మంత్రిత్వ శాఖ తన కార్యాలయాలతో దేశవ్యాప్తంగా పట్టణ గ్రామీణ ప్రాంతాలలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ

ప్రచారాన్ని ప్రారంభించారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆగస్టు 2వ తేదీ నుంచి నిర్వహిస్తోంది. కాగా, ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు 15 రోజుల పాటు "స్వచ్ఛతా హి సేవా" ప్రచారం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - మయన్మార్ మధ్య ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద కంచె నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. మొత్తం ఒక వెయ్యి 643 కిలోమీటర్ల మేర విస్తరించిన అంతర్జాతీయ సరిహద్దుకు నిర్మాణం కోసం 31 వేల కోట్ల రూపాయలు  ఖర్చు చేయనున్నామని సంబంధిత అధికార్య వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =